## కొత్త ప్రతిభకు ప్రోత్సాహం



తెలుగు సినీరంగంలో ఔత్సాహిక రచయితలను ప్రోత్సహించే లక్ష్యంతో రూపొందించిన 'ది స్క్రిప్ట్ క్రాఫ్ట్' వెబ్‌సైట్‌ను అగ్ర నటుడు ప్రభాస్ సోషల్ మీడియా ద్వారా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ ఫొటోను షేర్ చేశారు. 'మీ కథలను ఈ వేదిక ద్వారా పంచుకోండి. మంచి కథలతో మీ ప్రతిభను ప్రపంచానికి తెలియజేయండి. మీ కథలతో కలల్ని నిజం చేసుకునేందుకు ఇదొక మంచి వేదిక' అంటూ ప్రభాస్ ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు. 'రచయితలు తమ స్క్రిప్ట్‌ను 250 పదాల నిడివిలో 'ది స్క్రిప్ట్ క్రాఫ్ట్' వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసుకోవచ్చు. అత్యధిక రేటింగ్ పొందిన స్క్రిప్ట్‌లను టాప్ ప్లేస్‌లో ఉంచుతాం. మా వెబ్‌సైట్ తొలి ప్రయత్నంగా మీ ఫేవరేట్ హీరోకు సూపర్ పవర్స్ వస్తే ఎలా ఉంటుందనే కాన్సెప్ట్‌తో స్క్రిప్ట్‌లను ఆహ్వానిస్తున్నది' అని వెబ్‌సైట్ ఫౌండర్స్ ప్రమోద్ ఉప్పలపాటి, వైష్ణవ్ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభాస్ రాజాసాబ్, సలార్-2, కల్కి-2 చిత్రాలతో పాటు హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాలతో బిజీగా ఉన్నారు.

## ఉందిలే మంచి కాలం



కన్నడ భామ పూజాహెగ్డే కెరీర్ తొలినాళ్లలోనే అగ్ర హీరోల చిత్రాల్లో అవకాశాలు దక్కించుకొని సత్తా చాటింది. ముఖ్యంగా తెలుగునాట యూత్‌లో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. అయితే గత కొన్నేళ్లుగా ఈ భామకు అదృష్టం ఏమాత్రం కలిసి రావడం లేదు. దక్షిణాదితో పాటు బాలీవుడ్‌లో ఆమె నటించిన చిత్రాలన్నీ డిజాస్టర్స్‌గా మిగిలాయి. దీంతో పూజాహెగ్డే కెరీర్ ఇక ముగిసినట్లే అని భావించారు. కానీ ఈ భామ అనూహ్యంగా పుంజుకుంది. తెలుగు, తమిళంలో భారీ అవకాశాలను దక్కించుకొని అందరినీ ఆశ్చర్యపరచింది. ప్రస్తుతం ఈ భామ చేతిలో ఐదు చిత్రాలున్నాయి. తమిళంలో సూర్య, విజయ్ 69 చిత్రాల్లో ఈ అమ్మడు కథానాయికగా ఖరారైంది. అలాగే బాలీవుడ్‌లో షాహిద్‌కపూర్ సరసన 'దేవ' చిత్రంలో నటించనుంది. ఇలా వరుస భారీ ఆఫర్లతో కోల్పోయిన వైభవాన్ని తిరిగి పొందే ప్రయత్నాలో ఉంది పూజాహెగ్డే. ఫెయిల్యూర్స్ వల్ల ఎప్పుడూ బాధపడలేదని, మంచి సమయం కోసం ఓపిగ్గా ఎదురుచూశానని, భవిష్యత్తులో అంతా మంచే జరుగుతుందనే నమ్మకం ఉందని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ధీమా వ్యక్తం చేసింది పూజా హెగ్డే.



## 21ఏండ్లుగా నాన్న జ్ఞాపకాల్లోనే..

'దేశభక్తి సినిమాలో లవ్, ఫ్యామిలీ ఎలిమెంట్స్‌ని మేళవించడం అంత సులభం కాదు. ఈ విషయంలో దర్శకుడు రాజ్‌కుమార్ అద్భుతమైన వర్క్ చేశాడు. నేను సాయిపల్లవి నటన, డ్యాన్స్‌కు పెద్ద అభిమానిని. ఆమెతో ఒక సినిమాలో డ్యాన్స్ చేయాలన్నదే నా కోరిక. ఆ రోజు తొందరలోనే రావాలని కోరుకుంటున్నా' అన్నారు హీరో నితిన్. బుధవారం జరిగిన 'అమరన్' చిత్ర సక్సెస్‌మీట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శివకార్తికేయన్, సాయిపల్లవి జంటగా రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో రూపొందిన 'అమరన్' చిత్రాన్ని తెలుగులో నితిన్ ఫాదర్ ఎన్.సుధాకర్ రెడ్డి విడుదల చేశారు. సాయిపల్లవి మాట్లాడుతూ 'నేను పోషించిన భానుమతి, వెన్నెల..ఇలా ప్రతీ పాత్రతో తెలుగు ప్రేక్షకులు కనెక్ట్ అయ్యారు. 'అమరన్'లో ఇందు పాత్రను కూడా అదే స్థాయిలో ఆదరిస్తున్నారు' అని చెప్పింది. ఈ వేడుకలో హీరో శివకార్తికేయన్ తన తండ్రిని గుర్తుచేసుకొని భావోద్వేగానికి గురయ్యారు. 'మా నాన్న నిజాయతీ గల పోలీస్ అధికారి. అమరన్ పాత్రలో ఆయన్ని చూసుకున్నా. నా మొదటి హీరో నాన్ననే. నాకు 17 ఏండ్ల వయసులో నాన్న మరణించారు. గత 21 ఏండ్లుగా ఆయన జ్ఞాపకాల్లోనే జీవిస్తున్నా' అని చెప్పారు. ఈ సినిమా ఇప్పటికే తెలుగులో ఇరవై కోట్ల వసూళ్లను దాటిందని నిర్మాత సుధాకర్ రెడ్డి తెలిపారు.

## ఐ హేట్ యూ డాడీ

విశ్వక్‌సేన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'మెకానిక్ రాకీ'. రవితేజ ముళ్లపూడి దర్శకుడు. ఎస్‌ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రామ్ తాళ్లూరి నిర్మిస్తున్నారు. ఈ నెల 22న ప్రేక్షకుల ముందుకురానుంది. బుధవారం ఈ సినిమా నుంచి 'ఐ హేట్ యూ మై డాడీ' అనే పాటను విడుదల చేశారు. జేక్స్ బిజోయ్ స్వరపరచిన ఈ పాటను సనారే రచించారు. రామ్ మిరియాల ఆలపించారు. తండ్రీ కొడుకుల మధ్య వుండే ప్రేమానుబంధాన్ని ఆవిష్కరిస్తూ ఈ పాట అర్థవంతంగా సాగింది. విశ్వక్‌సేన్ డ్యాన్స్ మూమెంట్స్ ఆకట్టుకున్నాయి. మాస్ యాక్షన్, కామెడీ ఎంటర్‌టైనర్ ఇదని, విశ్వక్‌సేన్ పాత్ర గత సినిమాలకు భిన్నంగా ఉంటుందని, వినోదానికి పెద్దపీట వేశామని చిత్రబృందం పేర్కొంది. మీనాక్షి చౌదరి, శ్రద్ధాశ్రీనాథ్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మనోజ్ కటసాని, సంగీతం: జేక్స్ బిజోయ్, రచన-దర్శకత్వం: రవితేజ ముళ్లపూడి.



## రెండు భాగాలుగా 'రామాయణ'



**రణబీర్‌కపూర్ రాముడిగా,** సాయిపల్లవి సీత పాత్రలో నటిస్తున్న బాలీవుడ్ ప్రతిష్టాత్మక చిత్రం 'రామాయణ' తాలూకు తాజా అప్‌డేట్ వెలువడింది. ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా తెరకెక్కించబోతున్నామని నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. 2026 దీపావళికి తొలిభాగం, 2027 దీపావళికి రెండో భాగాన్ని విడుదల చేయబోతున్నట్లు తెలిపారు. నితేష్ తివారి దర్శకత్వం వహిస్తున్న ఈ భారీ పాన్ ఇండియా సినిమా షూటింగ్ కొద్దిమాసాల క్రితమే ముంబయిలో మొదలైంది. అయితే ఈ సినిమాకు సంబంధించిన ఏ విషయాన్ని ఇప్పటివరకు అధికారికంగా ప్రకటించలేదు. తాజా అప్‌డేట్‌తో ఈ సినిమా నిర్మాణంపై ఓ స్పష్టత వచ్చిందని అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. విజువల్ ఎఫెక్ట్స్ కోసం హాలీవుడ్‌కు చెందిన ప్రముఖ సంస్థతో నిర్మాతలు సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిసింది. ఏ.ఆర్.రెహమాన్‌తో పాటు హాలీవుడ్ టాప్ మ్యూజిక్ డైరెక్టర్ హన్స్ జిమ్మెర్ ఈ చిత్రాన్ని సంగీతాన్నందించబోతున్నారు. ఈ సినిమాలో రావణ పాత్రలో నటిస్తున్నట్లు కన్నడ అగ్ర నటుడు యష్ ఇటీవలే ప్రకటించారు. హనుమంతుడి పాత్రలో సన్నీ డియోల్, శూర్పణఖగా రకుల్‌ప్రీత్ సింగ్, కైకేయి పాత్రలో లారా దత్తా నటించనున్నారని వార్తలొస్తున్నాయి. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ముంబయిలో వేసిన భారీ సెట్‌లో జరుగుతున్నది.

## త్రిబాణధారి బార్బరిక్

పౌరాణిక కాన్సెప్ట్‌తో రూపొందిస్తున్న చిత్రం 'త్రిబాణధారి బార్బరిక్'. ఘటోత్కచుడి కుమారుడైన బార్బరికుడి నేపథ్యంలో ఈ సినమా రాబోతున్నది. సత్యరాజ్, వశిష్ట ఎన్ సింహా, సాంచి రాయ్, సత్యం రాజేష్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహిస్తున్నారు. వానర సెల్యూలాయిడ్ పతాకంపై విజయపాల్ రెడ్డి అదిధాల నిర్మిస్తున్నారు. బుధవారం మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఏకకాలంలో మూడు బాణాలు వేయడంలో బార్బరికుడు నేర్పరి అని, అందుకే టైటిల్‌లో త్రిబాణధారి అని పెట్టామని, పౌరాణిక, సమకాలీన అంశాల మేళవింపుతో ఆకట్టుకునే వినూత్న కథాంశమిదని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: కుశేందర్ రమేష్ రెడ్డి, సంగీతం: ఇన్ఫ్యూషన్ బ్యాండ్, సమర్పణ: మారుతి టీమ్ ప్రొడక్ట్, రచన-దర్శకత్వం: మోహన్ శ్రీవత్స.



## యాక్షన్ డ్రామా 'భైరవం'



బెల్లంకొండ సాయిశ్రీనివాస్, మనోజ్ మంచు, నారా రోహిత్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'భైరవం' విజయ్ కనకమేడల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కేకే రాధామోహన్ నిర్మిస్తున్నారు. బుధవారం నారా రోహిత్ ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. అగ్నితో నిండిన టెంపుల్ బ్యాక్‌డ్రాప్‌లో యాక్షన్ అంశాలతో లుక్ ఆకట్టుకునేలా ఉంది. 'యాక్షన్ డ్రామాగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. నారా రోహిత్‌పై చిత్రీకరించిన యాక్షన్ ఘట్టాలు హైలైట్‌గా నిలుస్తాయి. డివోషనల్, యాక్షన్ అంశాల కలబోతగా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినందిస్తుంది' అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: హరి కె వేదాంతం, సంగీతం: శ్రీచరణ్ పాకాల, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: విజయ్ కనకమేడల.

## ట్రెండ్‌కు భిన్నంగా సినిమా చేశా!



'ఇప్పటివరకు విభిన్న కథా చిత్రాల్లో నటించా. అయితే నా కెరీర్‌లో చేసిన పెద్ద సినిమా మాత్రం ఇదే' అన్నారు చేతన్ కృష్ణ. ఆయన కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'ధూం ధాం' ఈ నెల 8న విడుదలకానుంది. సాయికిషోర్ మచ్చా దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ఎంఎస్ రామ్‌కుమార్ నిర్మించారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో హీరో చేతన్ కృష్ణ మాట్లాడుతూ 'ఫస్ట్‌ర్యాంక్ రాజు, బీచ్ రోడ్ చేతన్, రోజులు మారాయి. గల్ఫ్ చిత్రాల ద్వారా నటుడిగా గుర్తింపు తెచ్చుకున్నా. ఫ్యామిలీ అంతా కలిసి చూసేలా ఫుల్ లెంగ్త్ ఎంటర్‌టైనర్ చేయాలని ఎప్పటినుంచో అనుకుంటున్నా. అలాంటి సమయంలో ఈ కథ కుదిరింది' అన్నారు. సినిమా కథ గురించి చెబుతూ 'తన కొడుకు అన్నింట్లో ది బెస్ట్‌గా ఉండాలని తపిస్తుంటాడు తండ్రి. ఆయన చేసిన గారాబంతో కొడుకు మరింత అల్లరివాడవుతాడు. అతని వల్ల ఓ అమ్మాయి సమస్యలో చిక్కుకుంటుంది. దానికి తానే పరిష్కారం చూపించాలని హీరో చేసే ప్రయత్నమే ఈ సినిమా ఇతివృత్తం' అన్నారు. సెకండాఫ్‌లో వెన్నెల కిషోర్ కామెడీ ప్రధానాకర్షణగా నిలుస్తుందని, చాలా మంది సీరియర్ ఆర్టిస్టులు భాగం కావడం వల్ల సినిమాకు భారీతనం వచ్చిందని చేతన్‌కృష్ణ తెలిపారు. ప్రస్తుతం నడుస్తున్న థ్రిల్లర్స్ ట్రెండ్‌కు భిన్నంగా చక్కటి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా 'ధూం ధాం' ప్రేక్షకుల్ని మెప్పిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



## పోరాట యోధుడి కథ

రాకేష్ వర్రే ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'జితేందర్ రెడ్డి'. ముదుగంటి రవీందర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రానికి విరించివర్మ దర్శకుడు. ఈ నెల 8న విడుదలకానుంది. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో హీరో రాకేష్ వర్రే మాట్లాడుతూ 'జితేందర్ రెడ్డి ఓ ఫైటర్. ఆయన పోరాటతత్వాన్ని ఈ సినిమాలో చూపించాం. 75 రూపాయలతో ఈ సినిమా ప్రీమియర్‌షోస్‌కు ప్లాన్ చేస్తున్నాం' అన్నారు. జగిత్యాలలో జరిగిన యథార్థ సంఘటనల నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కించామని దర్శకుడు విరించి వర్మ తెలిపారు. ఈ సినిమా ప్రీమియర్ చూసినవాళ్లు కన్నీళ్లు పెట్టుకున్నారని, అంతలా హృదయాన్ని కదిలించే సన్నివేశాలుంటాయని నిర్మాత ముదుగంటి రవీందర్ రెడ్డి అన్నారు. ఈ చిత్రానికి గోపీసుందర్ స్వరకర్త.

## మర్డర్ వెనక మిస్టరీ



జోశర్మ ప్రధాన పాత్రలో నటించిన మర్డర్ మిస్టరీ థ్రిల్లర్ 'ఎమ్4ఎమ్' (మూటీవ్ ఫర్ మర్డర్). స్వీయ దర్శకనిర్మాణంలో మోహన్ వడ్లపట్ల రూపొందించారు. త్వరలో తెలుగుతో పాటు ఐదు భాషల్లో విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా దర్శకనిర్మాత మోహన్ వడ్లపట్ల చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'సరికొత్త సస్పెన్స్ థ్రిల్లర్ సబ్జెక్ట్‌తో ఈ చిత్రాన్ని తీశాను. ఇప్పటివరకు ఈ తరహా కథాంశం తెలుగు తెరపై రాలేదు. ఓ కిల్లర్ నేపథ్యంలో ఆద్యంతం ఉత్కంఠను పంచుతుంది. సాంకేతికంగా ఉన్నత ప్రమాణాలతో తెరకెక్కించాం. తప్పకుండా తెలుగు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినందిస్తుంది' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: వసంత్ ఇసాయిపెట్టై, నిర్మాణం, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: మోహన్ వడ్లపట్ల.




